నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, మంగళవారం 30 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్టులు

- బీబీనగర్, తుర్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఎంపిక

భువనగిరి అర్బన్, జనవరి 29 : ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో 5 రోజులపాటు జరుగనున్న దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాకు చెందిన రెండు ఎగ్జిబిట్లు ఎంపికయ్యాయని డీఈఓ కె.నాయణరెడ్డి సోమవారం ప్రటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించగా బీబీనగర్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి చదువుతున్న కె.సాయితేజ, గైడ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సహకారం తయారు చేసిన ప్రాజెక్టు హమాలీలకు సులభంగా లోడ్ మోసే పరికరం ఎంపికైందని పేర్కొన్నారు. అలాగే తుర్కపల్లి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి టి.వైష్ణవి, గైడ్ ఉపాధ్యాయురాలు జరీనా బేగం సహకారంతో తయారు చేసిన ప్రాజెక్ట్ పువ్వుల రీసైక్లింగ్ ఎంపికైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 25 ప్రాజెక్టుల్లో జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఉండడంతో పలువురు వారిని అభినందించారు.

కాంగ్రెస్ దౌర్జన్యకాండ

రోజురోజుకూ పెట్రేగిపోతున్న అరాచకం

- ఉమ్మడి జిల్లాలో హస్తం నేతల గూండాగిరీ
- మొన్న 'గుట్ట'.. నిన్న సూర్యాపేటలో ఆగడాలు
- తాజాగా మంత్రి సమక్షంలోనే ఏకంగా జడ్పీ చైర్మన్‌పై అటాక్
- తీవ్రంగా ఖండిస్తున్న ప్రజాస్వామిక వాదులు
- నాడు బీఆర్ఎస్ పాలనలో ఫ్రెండ్లీ రూలింగ్

మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలతో జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిని వేదిక మీది నుంచి నెట్టుకు పోతున్న పోలీసులు

జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డితో వాగ్వాదానికి దిగిన మంత్రి కోమటిరెడ్డి

యాదాద్రి భువనగిరి, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సరిగ్గా రెండు నెలలు కూడా కాలేదు. అప్పుడే తన నైజాన్ని బయటపెట్టుకుంటున్నది. ప్రభుత్వం, నేతలను ప్రశ్నించినా.. తప్పిదాలకు ఎదురు నిలబడినా దౌర్జన్యాలకు తెగబడుతున్నది. నేరుగా దాడులకు దిగుతూ ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలే ఇందుకు తార్కాణం. వారం రోజుల్లోనే మూడు చోట్ల వేర్వేరుగా ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.

జడ్పీ చైర్మన్‌పైనే దాడి..

బీబీనగర్ మండలంలోని గూడూరులో సోమవారం గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ జడ్పీ చైర్మన్ హాజరయ్యారు. రైతుబంధు రాలేదన్నోళ్లను చెప్పుతో కొట్టాలని మంత్రి అనడం సబబుకాదని సందీప్ రెడ్డి సున్నితంగా ఆయన దృష్టికి తెచ్చే ప్రయత్నం తెచ్చారు. అలా అన్నారో లేదో అప్పుడే కాంగ్రెస్ కార్యకర్తలు సందీప్ రెడ్డి ప్రసంగానికి అడ్డుతగిలారు. జోక్యం చేసుకున్న మంత్రి.. 'కనీసం వార్డు మెంబర్ గెలిచే స్థాయిలో కూడా లేనోడివి నన్ను విమర్శిస్తావా' అంటూ అడ్డగోలుగా వ్యాఖ్యానించారు. దీనికి సందీప్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి తగ్గకపోగా.. మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల అరాచకం మొదలైంది. ఏకంగా స్టేజీపైకి వచ్చి అడ్డగోలుగా వ్యవహరించారు. సందీప్ రెడ్డి డౌన్‌డౌన్, గోబ్యాక్ అంటూ స్లోగన్లు ఇచ్చారు. సందీప్ రెడ్డిపైకి దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతోపాటు తీవ్ర తోపులాట జరిగింది. ఓ కార్యకర్త ఏకంగా సందీప్‌రెడ్డిని వెనకాల నుంచి భుజంపై కొట్టి.. ముందుకు నెట్టివేశారు. బీఆర్ఎస్ నేతలు సందీప్ రెడ్డిని పక్కకు తీసుకెళ్లారు. మరోవైపు ఈ ఘటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సూర్యాపేటలో రాళ్లు, కోడి గుడ్లు విసిరి..

సూర్యాపేట మున్సిపల్ కౌన్సిలర్ గండూరి పావనీకృష్ణ పాకర్‌పై ఆదివారం దాడి జరిగింది. ఏకంగా కాంగ్రెస్ కౌన్సిలర్లే అటాక్ చేశారు. వారికి బీజేపీ, బీఎస్పీ సభ్యులు వత్తాసు పలికారు. ఇంటిపై రాళ్లు, కోడిగుడ్లు విసిరి భయానక వాతావరణాన్ని సృష్టించారు. దాంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆయా పార్టీ నేతల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత వై.వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణతోపాటు పలువురికి గాయాలయ్యాయి.

యువజన సంఘం భవనం కూల్చివేత

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఈ నెల 22న యువజన సంఘం కార్యాలయాన్ని అధికారులు కూల్చివేశారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో సుమారు వంద పోలీసులతో జేసీబీతో నేలమట్టం చేశారు. మల్లాపురం సర్పంచ్ తన సొంత నిధులు రూ.25లక్షలతో నిర్మించారు. ఇది నక్క బాటలో ఉందంటూ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఒత్తిడితో నోటీసులు ఇవ్వకుండా భవనాన్ని కూల్చేశారు. ప్రశాంతంగా ఉన్న మల్లాపురంలో భయానక వాతావరణం సృష్టించారు.

నాడు ప్రశాంతం.. నేడు భయానకం..

బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణం ఉండేది. ప్రజాప్రతినిధుల మధ్య రాజకీయ విమర్శలకే పరిమితం అయ్యేది. వ్యక్తిగత దూషణలు, దాడులు, దౌర్జన్యాలు ఉండేవి కాదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడువక ముందే అరాచకాలు చేస్తున్నది. ప్రశాంతం ఉన్న పల్లెలను ఘర్షణల వైపు మళ్లిస్తున్నది. ప్రతిపక్ష నేతలపై పార్టీ శ్రేణులను రెచ్చగొడుతూ దాడులకు ఉసిగొల్పుతున్నది.

కోమటిరెడ్డి.. తీరు మారకుంటే చెప్పు దెబ్బలు ఖాయం

- భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డిపై దాడి నీతిమాలిన చర్య
- నీ పర్సనల్ లైఫ్ గురించి విప్పితే చరిత్ర హీనుడివైతావు
- కోమటిరెడ్డిపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం

సూర్యాపేట, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : 'కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతు బంధు అడిగినోళ్లను చెప్పులతో కొట్టాలని అంటాడు. సమస్యలపై ప్రశ్నించినోళ్లపై దాడులు చేయిస్తూ ఆటవికుడిలా ప్రవర్తిస్తున్నాడు. భువనగిరి మండలంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనం' అని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి నిరోధకుడు కోమటిరెడ్డి అని, మెడికల్ కళాశాల తెస్తానని చెప్పి నాలుగుసార్లు గెలిచి మోసం చేశాడని అన్నారు. నిజాం హయాంలో వేసిన రోడ్లు తప్ప ఆయన హయాంలో ఒక్క రోడ్డు వేయలేదని తెలిపారు. మాధవరెడ్డి మంచి నాయకుడే కానీ.. ఆయన కుమారుడు సందీప్‌రెడ్డి ఓ బచ్చా అని కోమటిరెడ్డి అనడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మాధవరెడ్డి పేరు చెప్పుకొని బతికిన కోమటిరెడ్డి.. ఆయన వెంట ఉన్న వారికి సిగరెట్లు తెచ్చి ఇచ్చినోడివి.. అసలు ఆయన బతుకేందో గుర్తెరగాలని అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉండి మాట్లాడుతుంటే ఏదో చిల్లరగాడు, చిల్లర మాటలు అనుకున్నాం.. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత మరింత హీనస్థాయికి దిగజారి మంత్రి అనే విషయం గుర్తెరగకుండా ఊరకుక్కలా మొరుగుతున్నాడని ధ్వజమెత్తారు. యాదాద్రి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై రెచ్చగొట్టి దాడి చేయించి జైళ్లో వేయాలని పోలీసులకు హుకూం జారీ చేయడం.. ఆ వెంటనే ఓ పోలీసు సందీప్‌రెడ్డిని నెట్టివేయడం పట్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఉద్యమంలో ఉన్న నాడు వైఎస్ఆర్ బూట్లు నాకిన కోమటిరెడ్డి.. అధిష్ఠానంలో ఒక నాయకుడి కాళ్లు పట్టుకొని మంత్రి పదవి తెచ్చుకుంటే ఇష్టం లేని కిరణ్‌కుమార్‌రెడ్డి తన క్యాబినెట్ నుంచి తన్ని తరిమేయబోతే రాజీనామా ట్యాగ్ తగిలించుకొని నాటకాన్ని పండించాడని మండిపడ్డారు. 'ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇంకా కొంతమంది కాంగ్రెసోళ్లు విసునూరు దొర, నిజాం కంటే పెద్దవాళ్లం అనుకుంటున్నారు.. నల్లగొండ జిల్లా చైతన్యం ముందు మీరు దేనికీ పనికిరారు' అని హితవు పలికారు. 'వాస్తవానికి మంత్రి పదవి తనకే రావాల్సి ఉన్నదని, రేవంత్‌రెడ్డి బెడ్‌రూంలోకి వెళ్లి కాళ్లు పట్టుకొని బతిమాలితేనే నీకు మంత్రి పదవి వచ్చిందని.. నీ తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై మాట్లాడితే నీ విషయాలు చాలా ఉన్నాయి.. ఇంకా విప్పుతా అన్నారు. తన 23 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ వ్యక్తిగత జీవితంపై మాట్లాడలేదని.. నీ వ్యక్తిగత జీవిత విషయాలు మాట్లాడితే వీధుల్లో కూడా తిరుగలేవని హెచ్చరించారు.

వ్రత మండపంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు

వైభవంగా లక్ష్మీనృసింహుడి తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి 29 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరు కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి తిరువరాధన చేపట్టి స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో లక్ష్మీనరసింహ స్వామికి నిత్యారాధనలు ఘనంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని సుమారు 12 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. 28,05,407 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

యాదగిరీశుడి హుండీల ఆదాయం రూ. 2,32,22,689

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి ఆదాయం భారీగా సమకూరింది. సంక్రాంతి పండుగతోపాటు వరుస సెలవులు రావడంతో స్వామివారిని పెద్ద సంఖ్యలో దర్శించుకుని కానుకలు సమర్పించారు. సోమవారం కొండకింద గల సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో హుండీలను లెక్కించారు. 25 రోజుల హుండీల ద్వారా రూ.2,32,22,689 వచ్చాయని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఇందులో 230 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 420 గ్రాములు మిశ్రమ వెండి ఉన్నాయని చెప్పారు. వీటితోపాటు ఆమెరికా దేశానికి చెందిన 593 డాలర్లు, యూఏఈకి చెందిన 65 దిరామ్స్, ఆస్ట్రేలియాకు చెందిన 65 డాలర్స్, కెనడాకు చెందిన 220 డాలర్స్, సింగపూర్, ఇంగ్లాండ్, సౌదీ అరేబియా, యూరోప్, ఒమన్, మలేషియా, ఖతార్, థాయ్‌లాండ్, న్యూజిలాండ్, బేహరన్, డెన్మార్క్, వియత్నాం దేశాలకు చెందిన కరెన్సీ స్వామి వారికి సమకూరిందని పేర్కొన్నారు.

కోమటిరెడ్డిది అహంకారం

మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 29 : 'మంత్రి కోమటిరెడ్డికి అహంకారం తలకు ఎక్కి మాట్లాడారు. గతంలో భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఒక్క నాడైనా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మాట్లాడలేదు. ఈ రోజు మంత్రిగా ఒక మంత్రికి సమాన హోదా కలిగిన వ్యక్తిని అవమాన పరిచారు' అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేదిలేదని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘటనను వ్యతిరేకించాలని కోరారు.

మంత్రివా.. వీధి రౌడీవా..?

మంత్రి కోమటిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఫైర్

యాదగిరిగుట్ట, జనవరి 29 : మంత్రి హోదా కలిగిన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని సభలో కించపరిచి, బయటకు పంపడంటూ అహంకార పూరితంగా, అసభ్యకరంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వీధిరౌడీగా వ్యవహించారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద బిక్షమయ్యగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలు నిండక ముందే ఇంతటి అహంకారంగా వ్యవహరించడం సరైంది కాదని సూచించారు. జడ్పీ చైర్మన్‌పై దాడిని ఆయన ఖండిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీరు ఉందన్నారు. ఇంతటి అహంకారికి మంత్రి పదవి తగదని, వెంటనే కోమటిరెడ్డిని క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి తీరును ప్రజలు గమనిస్తున్నారని, మరికొన్ని రోజుల్లో జనం నుంచి ఆయనకు వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. వెంటనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డికి క్షమాపన చెప్పాలన్నారు.

ప్రజా వేదికపై ప్రతినిధిని అవమానించడం దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల, కంచర్ల రామకృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 29 : ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ప్రజా వేదికపై జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అవమానపర్చడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వేదికపై వాగ్వాదాలు జరుగడం వల్ల ప్రజా ప్రతినిధులపై జనం నమ్మకం కోల్పోతారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వ్యక్తిగతంగా దూషించడం సరికాదని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు : కంచర్ల రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీలను, నాయకత్వాన్ని కించపరచడం, దూషించడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఏదైనా ఉంటే తమ పార్టీ సమావేశంలో మాట్లాడుకోవాలి తప్ప ఇలా వాఖ్యానించడం సరికాదని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌ను 100 అడుగుల లోతులో గోతి తీసి పెడుతా, కొన ఊపిరితో పాతిపెడుతా, కేటీఆర్ కాలిగోటికి సరిపోడ నడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 50 రోజులే అయ్యిందని, అప్పుడే సహనం కోల్పోయి మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రతిపక్షంగా నిలబడి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో డిసెంబర్ 9 నుంచి కరెంట్ బిల్లు కట్టవద్దని, బ్యాంకులకు వెళ్లి రూ.2లక్షలు తీసుకుంటే వెంటనే మాఫీ చేస్తామని చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల పొట్టగొట్టారని, ఇప్పటికి 26 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లో జడ్పీ చైర్మన్లు బీఆర్ఎస్ వారే ఉన్నారని, దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జడ్పీటీసీ బీరు మల్లయ్య, బీబీనగర్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్ కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

విషాదాంతం

మిర్యాలగూడ రోడ్డుప్రమాదంలో ఆరుకు చేరిన మృతులు

కన్నుమూసిన అక్కాచెల్లెళ్ల కుటుంబాలు

మిన్నంటిన రోదనలు

రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా ఘోర ప్రమాదం

మహేశ్, జ్యోతి, రషిత (ఫైల్)

మశ్చేందర్, మాధవి, లియాన్స్ (ఫైల్)

మిర్యాలగూడ/వలిగొండ, జనవరి 29 : వారం పాటు తీర్థయాత్రలకు వెళ్లిన వారు మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన ఉండగా రోడ్డుప్రమాదంలో మృత్యుబారిన పడ్డారు. మిర్యాలగూడ పట్టణంలో అద్దంకి – నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం చెందగా, సోమవారం మరో మహిళ దవాఖానలో కన్నుమూసింది. దాంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. బాధిత కుటుంబం అంగీకారంతో ఆరుగురి నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్‌కు చెందిన దేవులపల్లి నాగభూషణం – పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె జ్యోతి(30)కి నందిపహాడ్‌కు చెందిన చెరుపల్లి మహేశ్(32)తో వివాహం చేశారు. చిన్న కుమార్తె మాధవి (24)ని వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన మశ్చేందర్ (29)కు ఇచ్చి వివాహం జరిపించారు. మహేశ్, జ్యోతికి ఒక కుమార్తె రిషిత (6) ఉండగా.. మశ్చేందర్, మాధవి దంపతులకు కుమారుడు లియాన్స్ (2) ఉన్నారు. కాగా, వీరు ఈ నెల 26న మహేశ్‌కు చెందిన షిఫ్ట్ కారులో విజయవాడ పెనుగంచిప్రోలు, మచిలీపట్నం సమీపంలోని మోపిదేవి శనీశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో కోటప్పకొండ వద్ద ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించి మిర్యాలగూడకు బయల్దేరారు. మిర్యాలగూడకు వచ్చే ముందు జ్యోతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాము హోటల్‌లో భోజనం చేసి ఆదివారం రాత్రి 11గంటల్లోపు వస్తామని చెప్పింది. అనంతరం దామరచర్ల మండలం రాళ్లవాగుతండా సమీపంలో ఉన్న దాబాలో భోజనం చేసి ఇంటికి బయల్దేరారు. రెండు నిమిషాల్లో తమ ఇంటికి చేరుకుంటామనేలోగా మిర్యాలగూడ పట్టణ పరిధిలోని కృష్ణ కాలనీ సమీపంలోకి రాగానే కారు పక్క నుంచి లారీ వేగంగా వెళ్తుండడంతో అదుపు చేసేందుకు కుడి వైపునకు తిప్పాడు. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌కు తగిలి రోడ్డు అవతలి వైపునకు ఎగిరి బోల్తా పడింది. ఇదే సమయంలో అటు నుంచి వచ్చిన పొట్టు లారీ కారును వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న చెరుపల్లి మహేశ్, జ్యోతి, రిషిత, మశ్చేందర్, లియాన్స్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటగిరి, సీఐ నర్సింహారావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి ఐదుగురి మృతదేహాలను కారులో నుంచి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన మాధవిని అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవి మృతిచెందింది. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ వెంకటగిరి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్లు, ఒక మనుమడు, మనుమరాలు చనిపోవడంతో దేవులపల్లి నాగభూషణం – పద్మ దంపతులు శోకసంద్రంలో మునిగిపోయారు. మహేశ్, జ్యోతి, రిషిత మృతదేహాలకు నందిపహాడ్ గ్రామంలో.. మశ్చేందర్, మాధవి, లియాన్స్ మృతదేహాలకు వారి స్వగ్రామం వలిగొండ మండలం గొల్నేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మశ్చేందర్ చౌటుప్పల్ మండలంలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

నందిపహాడ్‌లో మృతుల ఇంటి వద్ద విషాద ఛాయలు

ఎమ్మెల్యే బీఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబీకులను సోమవారం ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సహాయం అందే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిపహాడ్ బైపాస్, చింతపల్లి రహదారికి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎన్నికల ముందు కోరినట్లు తెలిపారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బైపాస్ రోడ్ల అండర్‌పాస్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.


ఈవీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జెండగే

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 29 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. సాధారణ, లోక్ సభ ఎన్నికల్లో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలపై అవగాహన కల్పించడానికి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈవీఎం ప్రదర్శన కేంద్రంలో ఓటింగ్ యంత్రాల పనితీరు పట్ల అవగాహన పొందాలని కోరారు. అంతకుముందు వివి